

లింగంపల్లిలో పోస్టాఫీస్ ప్రారంభం

చౌడాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లిలో సోమవారం ముజాహిద్‌పూర్ పోస్టాఫీస్ పరిధిలోని తొమ్మిది గ్రామాలను కలుపుతూ నూతన పోస్టాఫీస్ బ్రాంచ్‌ని తాండూరు సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రమేశ్, పంచాయతీ కార్యదర్శి రాఘు, సబ్ పోస్టుమాస్టర్ సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 68 వినతులు
- డీఆర్వో హరిప్రియ



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో హరిప్రియ

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 68 అర్జీలను స్వీకరించి సంబంధిత శాఖలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పరిష్కారం అయ్యేవిధంగా చూడాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వినతులపై వచ్చిన చర్యలను వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

అదృష్టం ఎవరిని వరించేనో?



వికారాబాద్/కొడంగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపాలిటీలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు లైసెన్స్ జారీ చేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు డ్రా తీస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి దరఖాస్తుదారులు, లేదా వారి నుంచి పవర్ ఆఫ్ అటార్నీ పొందిన వ్యక్తులు తప్పనిసరిగా ఉదయం 10 గంటలకు ఎంట్రీ పాస్‌తో హాజరు కావాలని సూచించారు. అయితే కొడంగల్ మున్సిపాలిటీలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ తెలిపారు. దరఖాస్తుదారులు ఉత్కంఠతో ఎదురు చూస్తుండగా అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.



పెద్దేముల్: కందనెల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

భూ భారతితో శాశ్వత పరిష్కారం

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

పెద్దేముల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భూ భారతితో దీర్ఘకాలిక భూసమస్యలు పరిష్కారం అవుతాయని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. రైతులకు తమ భూములపై ఉన్న అభద్రత భావాన్ని తొలగించి జవాబుదారితనాన్ని పెంచేందుకే భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. దీని ద్వారా భూ లావాదేవీలు సులభతరం అవుతాయన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి అధికారులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కందనెల్లిలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, ఉప్పరి రమేష్, శోభారాణి, ముజీప్‌ఖాన్, విఠల్‌నాయక్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

రైతుల భూములకు భద్రత

ధారూరు: ధరణి స్థానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతుల భూములకు భద్రత ఉంటుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. ధారూరు రైతు వేదికలో సోమవారం భూ భారతి చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూభారతితో అధికారులే గ్రామాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదాబేగం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

భూమంటే ఆత్మగౌరవం

కోట్‌పల్లి: భూభారతిపై మండలంలోని బుగ్గపురం డీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి అంటే ఆత్మగౌరవం అన్నారు. భూభారతితో వారసత్వ, ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూమి, దేవాదాయశాఖ భూములు అనేది స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి భూ సమస్యలున్నా కోర్టులను ఆశ్రయించకుండా పరిష్కరించుకునే వెసులుబాటు భూభారతి చట్టం ద్వారా వచ్చిందన్నారు.

మేఘం.. ఆగమాగం!

రైతుల గుండెల్లో అకాల వర్షాల గుబులు

పంట చేతికొచ్చే వేళ రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఉరుములు, మెరుపులతో ఆకాశం మేఘావృతమై ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. విన్నటిదాకా ఎండలు, విద్యుత్ కోతలు, అడుగంటిన భూగర్భ జలాలతో అష్టకష్టాలు పడ్డ రైతులు వడగండ్ల వానకు పంట దెబ్బతింటుందేమోనని గుబులు పడుతున్నారు. ఇటీవల కురిసిన గాలివానకు వికారాబాద్, మోమిన్‌పేట్, పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో పంటలు నేలకొరిగాయి. మళ్లీ గాలివాన వస్తే తీవ్రంగా నష్టపోతామేమోనని ముందుగానే పంటను కోస్తున్నారు. మరికొద్ది రోజులు గాలివానలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించడంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు.
- పరిగి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి)



సుల్తాన్‌పూర్‌లో నేలకొరిగిన జొన్న పంట(ఫైల్)

- పంట చేతికొచ్చే వేళ కమ్ముకుంటున్న మబ్బులు
- పలు చోట్ల కోతలు షురూ.. కల్లాల్లో ధాన్యం
- యాసంగి పంటలకు వడగండ్ల భయం
- జిల్లాలో 95,834 ఎకరాల్లో వరి సాగు
- 45,634 ఎకరాల్లో ఇతర పంటలు

యాసంగిలో వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటలు 1,22,593 ఎకరాల్లో సాగవుతుండగా, వరి 95,834 ఎకరాలు, వివిధ రకాల పంటలు 45,634 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఒక్క వేరుశనగ తప్ప మిగతా పంటలన్నీ కోత దశకు వచ్చాయి. అయితే ఈ ఏడాది భూగర్భజలాలు అంతంతమాత్రమే ఉండడంతో వరి సాగు

మిగతా 8వ పేజీలో...

ఆందోళనకు గురవుతున్నాం



నిన్న, మొన్నటి వరకు నీళ్ల సరిగా అందక ఇబ్బందులు పడ్డాం. ఎంత కష్టపడినా సగం ఎండిపోయింది. ఉన్న సగం కోతకొచ్చింది. మరో వారం రోజుల్లో పంటను కోస్తాం. వారం రోజులుగా ఉరుముతో చినుకులు పడుతున్నాయి. వడగళ్ల వాన పడితే చేసిన కష్టమంతా నేలపాలవుతుంది.
- ఆంజనేయులు, రైతు, సుల్తాన్‌పూర్, పరిగి




పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో వడగండ్ల వానకు రాలిపోయిన వడ్లు (ఫైల్)

రెండు రోజులుగా మేఘావృతం 8



ఘనంగా రుద్రాభిషేకం



కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామికి ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం నిత్య సేవల్లో భాగంగా ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అభిషేకాలకు, అర్చనలకు అనుమతించారు. సోమవారం కావడంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.
కీసర, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి)



ఈ చెట్లు ఇక కనుమరుగు!
- రోడ్డు విస్తరణకు అడ్డొస్తున్నాయని తొలగింపునకు కసరత్తు
- చెట్ల చుట్టు కొలతలు తీసే పనిలో అధికారులు
6

ట్రామాకేర్‌పై ఆశలు

తాండూరులో ఏర్పాటుకు అడుగులు

- అత్యవసర చికిత్సకు అవకాశం
- రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గింపే లక్ష్యం!



తాండూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటనతో తాండూరులో ఏర్పాటుకు ప్రతిపాదించిన 'ట్రామాకేర్ సెంటర్‌పై ఆశలు చిగురించాయి. గత మార్చి 29న హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్య శ్రీ ట్రస్టు కార్యాలయంలో వైద్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారుల సమీపంలో ఉన్న ఆస్పత్రులను మ్యాపింగ్ చేయాలని,

మిగతా 8వ పేజీలో...

ప్రతి 35 కి.మీ.లకు ఒకటి

ప్రమాదాలు జరిగినప్పుడు సరైన వైద్య సేవలు అందకపోవడంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం ప్రతి 35 కిలో మీటర్లకు ఒక ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా రోడ్లకు సమీపంలో ఉన్న బోధనాసుపత్రులు, జిల్లా ఆస్పత్రులు, ప్రాంతీయ ఆస్పత్రులకు మ్యాపింగ్ చేస్తున్నారు. దీంతో జిల్లా ఆస్పత్రిగా ఉన్న తాండూరు ఆస్పత్రి ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంది.

ఎమ్మెల్యే చొరవ చూపాలి



తాండూరులో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అనుకుల పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో 70 నుంచి 90 ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్వహించింది. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపి దశాబ్ద కాలం దాటింది. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవ చూపిస్తే సాధ్యమవుతుంది. - ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కొడంగల్‌లో పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం

- వీబీఆర్ఐ జాయింట్ డైరెక్టర్ సునీత

కొడంగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లో పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ జాయింట్ డైరెక్టర్ జి.సునీత తెలిపారు. పరిగి, పూడూరు, కొడంగల్ మండలాల్లో కొనసాగుతున్న పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి కొడంగల్‌లో పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సీఎం సూచన మేరకు కొడంగల్‌లో పర్యటించినట్లు పేర్కొన్నారు. పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏర్పాటుకు భవనం అందుబాటులో ఉందని, చిన్నచిన్న మార్పులు, చేర్పులు చేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి సదానందం, సహాయ సంచాలకులు విజయభాస్కర్‌రెడ్డి, పశువైద్యాధికారి పరమేశ్, సిబ్బంది వెంకటయ్య, రాజు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని ఉమెన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి, శుభ్రత, భద్రత పరంగా తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి, నిర్వహణలో మెరుగుదల కోసం అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భగా మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని వేగవంతంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం అందించడమే పోలీస్‌శాఖ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ స్టేషన్ సిబ్బందితో సమావేశమై, విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర, మహిళా ఎస్‌ఐలు రాణి, స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి పాసయ్యేలా చూడాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి శంకర్

వికారాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి ఎన్.శంకర్ అన్నారు. సోమవారం ఇంటర్మీడియట్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేదీలోపు అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించడానికి ప్రిన్సిపాళ్లు చర్యలు చేపట్టాలన్నారు. ఫెయిలైన విద్యార్థులకు ఉపన్యాసకులు మార్గదర్శనం చేయాలన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాస్థాయి ఫలితాలు మెరుగుపడ్డాయని తెలిపారు. మార్చి నెలలో పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ నెల 30వ తేదీ వరకు పరీక్ష ఫీజును సంబంధిత కళాశాలలో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ తెలిపారు. తర్వాత ఫీజు చెల్లింపునకు గడువు పెంపు ఉండదని స్పష్టం చేశారు. దీనిని విద్యార్థులు గుర్తించి పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, కుమారస్వామి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వరరావు, నర్సింహులు, తాండూరు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లి నాథప్ప, ఉపన్యాసకులు రాములు, రఘు, వీర్‌దాస్, ఆఫీస్ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

షాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, కౌన్సిల్ మెంబర్ పీసరి సతీష్‌రెడ్డిలతో కలిసి సంస్థాగత ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ మండల సెక్రటరీ రెండు పోస్టులకు 9 మంది, నాలుగు ఉపాధ్యక్ష పోస్టులకు పది మంది, ఆరు కార్యవర్గ సభ్యులకు 10 మంది పోటీలో నిలిచారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, రవీందర్‌రెడ్డి, కిరణ్, నారాయణ, జనార్ధన్‌రెడ్డి, మహేందర్, మహేష్, గోవర్ధన్, రవిచారి, అనంతం, నాజ్, రాజీవ్‌రెడ్డి, గణేష్ సురేష్, శ్రీనివాస్, మల్లేశ్, రామకృష్ణ, సునిల్, రాజ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, శ్రీనురెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

షాద్‌నగర్ రూరల్ : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును ప్రజలకు చెప్పాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. 'గావ్ చలో-బస్తీ చలో' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాలలో పర్యటించారు. వారు మాట్లాడుతూ.. పేదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీజేపీ కార్యకర్తలు వివరించి చెప్పాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, ఇస్నాతి శ్రీనివాస్, కుర్మయ్య, ప్రశాంత్, గణేష్, విష్ణు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ చెట్లు ఇక కనుమరుగు!

- రోడ్డు విస్తరణకు అడ్డొస్తున్నాయని తొలగింపునకు కసరత్తు
- బషీరాబాద్- లక్ష్మీనారాయణపూర్ మధ్య ఫోర్‌లేన్ రోడ్డు
- చెట్ల పొడవు, చుట్టు కొలతలు తీసే పనిలో ఆర్అండ్‌బీ, అటవీశాఖలు


బషీరాబాద్ ప్రధాన రోడ్డులో అటవీశాఖ నాటి పెంచిన చెట్లు

బషీరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): హరితహారం కార్యక్రమంలో భాగంగా పదేళ్ల కిందట అటవీశాఖ నాటి పెంచిన వందలాది చెట్లు త్వరలో కనుమరుగుకానున్నాయి. ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణం చేపట్టనుండడంతో ఆ చెట్ల తొలగింపు చర్యలకు ఉపక్రమించారు. ఈమేరకు


చెట్టు కొలతలు తీస్తున్న సిబ్బంది

చెట్ల పొడవు, చుట్టూ కొలతలు తీస్తూ జరిగే నష్టంపై ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికారులు లెక్కలు వేస్తున్నారు. తాండూరు మార్గం లక్ష్మీనారయణపూర్- బషీరాబాద్ వరకు 18కిలోమీటర్ల డబుల్ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా మార్చబోతున్నారు. ఇందుకు రూ.66 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో రోడ్డు వెడల్పుకు హిటాచీలతో పనులను ముమ్మరం చేశారు. కాగా మార్గమధ్యలో నారాయణపూర్ గేటు నుంచి నవాల్గ వరకు అటవీశాఖ పదేళ్ల కిందట ఇరువైపుల వివిధ రకాల మొక్కలను నాటి పెంచింది. నేడు అవి ఏపుగా పెరిగాయి. ఇప్పుడు ఆ చెట్లు కనుమరుగు కానున్నాయి. ఈ నాలుగు లేన్ల రోడ్డు పనులకు అడ్డుగా వస్తుడంతో ఆర్అండ్‌బీ అధికారులు అటవీశాఖ అధికారులకు తొలగింపునకు అనుమతి ఇవ్వాలని అర్జీ పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఆయా శాఖల అధికారులు సంయుక్తంగా కలిసి చెట్లు ఎన్ని ఉన్నాయి.. ఏఏ చెట్లు రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయనే దానిపై సర్వే చేశారు. ఈ చెట్ల తొలగింపునకు అటవీశాఖ అనుమతి తప్పనిసరి కావడంతో ఆదిశగా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికార సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా చెట్లను లెక్కగడుతూ వాటి పొడవు, చుట్టూకొలతలు తీసేపనిలో నిమగ్నమయ్యారు. నిబంధనల ప్రకారం ఈ చెట్ల వాల్యువేషన్‌ను అంచనావేసి వాటి విలువను కట్టి పరిహారం కట్టించుకుని చెట్ల తొలగింపునకు అటవీశాఖ అనుమతి ఇస్తుందని ఓఅధికారి తెలిపారు.

శ్రీదుర్గా మల్లీశ్వరి అలంకరణలో శివుడు



తాండూరు, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి) : తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయంలో కొలువైన శివుడు సోమవారం విజయవాడలో వెలిసిన శ్రీ దుర్గా మల్లీశ్వరి అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు విజయ కుమార్ స్వామి వారిని అలంకరణ చేశారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈఅలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

పేదలకు ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం


ఎల్‌వోసీని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని డీసీసీ అధికార ప్రతినిది గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన ఇప్పళ్ల అంజయ్య కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో చికిత్సకు ప్రభుత్వం ద్వారా రూ. 2 లక్షలు మంజూరు అయ్యాయి. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో రాజకీయాలకు చోటు లేకుండ ప్రజలంతా పాలుపంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు మాలే మల్లేశ్ గౌడ్, పిప్పల్ల యాదయ్య, యాదగిరి రెడ్డి, క్యామ రాజేశ్, షాబోద్దీన్, బోసు రవి, రాజేందర్‌గౌడ్, బానుకిరణ్, శ్రీకాంత్, శ్రీను నాయక్, నరేశ్, చెన్నయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

మురుగు కాల్వ పనుల పరిశీలన

కడ్తాల మండల కేంద్రంలోని 12, 13 వార్డులలో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. రూ.10 లక్షలతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో కాల్వ నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దశలవారీగా అన్ని కొత్త కాలనీలలో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, చెన్నయ్య, మహేశ్, మంకిశ్రీను, కిరణ్, యాదయ్య, బాబులు, శ్రీశైలం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్పస్వామి కల్యాణం


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న గొల్ల కురుమలు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కతల, టేకులపల్లి గ్రామాల్లో గొల్ల కురుమలు సోమవారం భక్తిశ్రద్ధలతో శ్రీ కామరతి బీరప్పస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణలతో ఒగ్గు పూజారులు కల్యాణాన్ని జరిపించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బంద విష్ణువర్ధన్‌రెడ్డి, గొల్ల బీరయ్య, సత్యనారాయణ, శ్రీశైలం, జిన్నారం మల్లేశం, గొల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి


పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ పూర్ణచంద్రరావు

వికారాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి అని వికారాబాద్ ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ కె.పూర్ణచంద్రరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని అలంపల్లి ప్రాంతంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది అశోక్, జగన్, మహేష్, పాల్గొన్నారు.

సెలవుల్లో ఊరెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలి

చౌదరిగూడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ఊరు వెళ్తున్న వారు వారిళ్లలో చోరీలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై రవీందర్‌నాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. చోరీల నివారణకు కొందుర్గు మండలంలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. ఇంటికి అలారం సిస్టమ్, లేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంకులాకర్లు, లేదా వెంట తీసుకెళ్లాలని చెప్పారు. ఇంటి గేటుకు బయటి తాళం వేయొద్దన్నారు. ఇంట్లో ఒక చిన్న లైట్ ఎప్పుడూ వేసి ఉంచాలని తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

పెద్దేముల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని గదులన్నింటినీ కలియతిరిగారు. అక్కడి వాతావరణాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషంట్, లాబరేటరీ, మందుల నిల్వ గదితోపాటు ఔట్‌పేషంట్, ఏఎంసీ తదితర రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఇంకా చేపట్టాల్సిన మరమ్మతులను త్వరగా చేయించాలని సూచించారు. ఆరోగ్యకేంద్రం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అవసరాలకు అనుగుణంగా లైట్లు, ఫ్యాన్లు సమకూర్చుకోవాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మందులలోటు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటని వెంటనే సరఫరా చేయిస్తామని పేర్కొన్నారు. అనంతరం బాలుర వసతిగృహాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, డాక్టర్ శ్వేత, ఇన్‌చార్జి ఎంపీడీవో రతన్‌సింగ్ తదితరులు ఉన్నారు.


పెద్దేముల్ పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వేసవిలో పశువులను కాపాడుకోవాలి

● చల్లటి ప్రదేశాల్లో సేద తీర్చాలి ● ప్రత్యేక దానా అందజేయాలి
● పరిశుభ్రమైన నీటిని తాగించాలి ● పశుపోషణపై పశువైద్యుల సూచనలు

చేవెళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):వేసవిలో అధిక ఉష్ణోగ్రత, సూర్యరశ్మిని పశువులు తట్టుకోలేవు. ఆవుజాతి పశువులతో పోలిస్తే గేదెజాతి పశువుల శరీరం నలుపు రంగులో ఉంటుంది. వాటి శరీరంలో కొవ్వు ఉండడంతో స్వేద గ్రంధులు తక్కువ ఉంటాయి. దీంతో వాటి శరీరం త్వరగా ఉష్ణతాపానికి గురవుతాయి. ఎగపోస్తాయి. వేసవిలో గేదెలు మేత తక్కువ తింటాయి. నీరు ఎక్కువ తాగుతాయి. అందువల్ల పొట్టలో అసిటిక్ ఆమ్లం ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. దీంతో పాల ఉత్పత్తి, పాలల్లో వెన్న శాతం తగ్గుతాయి. ఏ పశువునైనా ఎండల్లో కట్టేయొద్దు. ఎండ కాలంలో రేకుల షెడ్డు కంటే చెట్ల కింద కట్టేయడం మంచిది. ఏ సమయంలోనూ ఎండ సోకకుండా చూసుకోవాలి. అలాగే వర్షం వచ్చే పిడుగులు పడే ఆస్కారం ఉంటుంది కాబట్టి ఆరు బయట, లేదా గుడిసెల్లో ఉంచడం పశువులకు సురక్షితం. వేసవిలో పశుపోషణలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి అంశాలపై చేవెళ్ల పశుసంవర్ధక శాఖ వైద్యురాలు శిరీష పలు అంశాలను వివరించారు.


పశువుల షెడ్డులో గేదెలు

వడదెబ్బ సోకకుండా చూసుకోవాలి

పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటి శరీర ఉష్ణోగ్రత పెరిగిపోతోంది. ఎగపోస్తాయి. చెమట పడుతాయి. అధిక దాహం, బలహీన పడడం, శ్వాస పీల్చడంలో ఇబ్బంది పడుతాయి. కొన్ని సార్లు అపస్మారక స్థితికి వెళ్లి చనిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పశువుల్ని నీడ ప్రదేశాల్లోకి మార్చాలి. వెంటనే తగినంత శుభ్రమైన నీటిని అందించి చికిత్స చేయించాలి. వేసవిలో గొంతువాపు, జబ్బువాపు వంటి వ్యాధులు సోకుతాయి. కాబట్టి ముందే టీకాలు వేయించాలి. పరాన్న జీవుల నిర్మూలన మందులు పిచికారి చేయాలి. దూడల వెంట్రుకలను, పెద్ద పశువుల పొడవాటి వెంట్రుకలు కత్తిరించాలి. మురికినీరు తాగితే జీర్ణకోశ సమస్యలు వస్తాయి. ఎప్పుడూ వాటికి పరిశుభ్రమైన చల్లటి నీటిని అందుబాటులో ఉంచాలి. రెండు నెలలకో సారి నట్టల మందు తాగించాలి.

వేడి నుంచి ఉపశమనం కల్గించాలి



వేసవిలో పశువులను ఎండలో ఎక్కువ సేపు ఉంచొద్దు. ఫైటోకూల్ వంటి పౌడర్‌ను రోజుకు 10గ్రాములు దాణాలో లేదా, 10ఎంఎల్ నీటిలో కలిపి తాగించాలి. పశువుల్లో పాల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు ప్రతీ 15-20నిమిషాలకు నీరు చల్లుతూ వేడి నుంచి ఉపశమనం కల్గించాలి. పశువైద్యుల సూచనలు తీసుకోవాలి.

- డాక్టర్ శిరీష, పశువైద్యురాలు, పలుగుట్ట

పునరుత్పత్తి సమస్య

ఎండ కాలంలో పశువుల్లో హార్మోన్ల లోపంతో పునరుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. ఎండుగడ్డి ఎక్కువ తినడం వల్ల విటమిన్-ఎ, కాల్షియం, కాపర్, మెగ్నీషియం తదితర ఖనిజ లవణాల లోపాలతో తాత్కాలిక వ్యంధత్వం కలుగుతుంది. వేసవి తాపంతో పశువుల్లో ఎద లక్షణాలు బహిర్గతం కావు. కాబట్టి ఆడ పశువుల్ని జాగ్రత్తగా గమనిస్తూ.. టీజర్ బుల్‌తో ఎద కాలాన్ని గుర్తించి, వీర్య దానం చేయించాలి. గేదెలు సంవత్సరం పొడువునా ఎదకొచ్చే ఆస్కారం ఉన్నా, వేసవిలో ప్రక్రియకు విఘాతం కలుగుతుంది. కాబట్టి రైతులు పశువులపై వేడి ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నాలు చేయాలి. నీరు ఎక్కువ తాగి మేత తక్కువ తింటాయి కాబట్టి మేతలో మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. పచ్చిగడ్డి ఎక్కువగా అందించాలి. పాలిచ్చే పశువులకు మరింత పచ్చిగడ్డి వేయాలి. ఎండుగడ్డిలో మూగుడి గడ్డి, యూరియా గడ్డి, సుబాబుల్ ఆకులు వేయాలి. ఎండుమేత ఎక్కువ వేసినప్పుడు విటమిన్-ఎ అదనంగా అందించాలి. ఎండు దానాను రాత్రి వేళల్లో వేయాలి. పశువులు సాధారణంగా 38డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకు తట్టుకోగలవు. అంత కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే శీతల స్థితి కల్పించాలి. రేకుల షెడ్డు అయితే గడ్డి పరిచి, నీళ్లు చల్లుతుండాలి. వడగాలుల నిరోధానికి షెడ్లకు చుట్టూ పరదాలు కట్టాలి. అవసరమైతే షెడ్డులో ఫ్యాన్లు, కూలర్లు, స్ప్రింకర్లు ఏర్పాటు చేయాలి. మధ్యాహ్నం వేళ పశువులపై రెండు మూడు సార్లు నీరు చల్లాలి. తడిసిన గోనె సంచుల్ని కప్పాలి. ప్రతీ పశువుకు 3 చ.మీ కనీస స్థలాన్ని కల్పించాలి. వీలుంటే పశువులు ఊదేందుకు పెద్ద ట్యాంకులను ఏర్పాటు చేయాలి. మేతకు ఎండల్లో పంపొద్దు.

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా భాస్కర్‌రెడ్డి



ఘట్ కే సర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఘట్‌కేసర్ కమిషనర్ చంద్రశేఖర్ 40రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డికి సీడీఎంఏ అధికారులు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బంట్వారం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఆడిట్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్మయి అన్నారు. మండల కేంద్రంలోని సహకార వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ర్యాలీలో పాల్గొని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ సంఘం మరింత అభివృద్ధి చేసుకునేందుకు ముందుకు రావాలన్నారు. రైతులు ముందుకు వచ్చి తమషేర్ డిపాజిట్ చేసి, వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే పలు సంఘాలు పెట్రోల్ బంక్లు, మందుల దుకాణాలు, ఇతరాత్రా వ్యాపారాలు సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సీఈవో బ్రహ్మం, సిబ్బంది శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


ధీరజ్‌కుమార్‌కు వీడ్కోలు పలుకుతున్న న్యాయవాదులు

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జికి వీడ్కోలు

షాద్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్‌కు న్యాయవాదులు సోమవారం వీడ్కోలు పలికారు. కోర్టు ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ.. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు కూడా కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన జడ్జిగా బాధ్యతుల చేపట్టిన సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉండకుండా లాయర్లు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కంచి పార్థసారథి, వేణుగోపాల్, గంతల శివయ్య, కొట్టె గంగాధర్, నరసింహ, బాలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో అలోక్ అగర్వాల్

విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లు

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): బూర్గుల కేంద్రంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లు అందజేసింది. సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 21మంది ఇంటర్ విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యే వరకు ఏడాదికి లక్ష చొప్పున సంస్థ తరపున అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ అగర్వాల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుమన తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్ ప్రదానం చేస్తున్న పురుషోత్తంరెడ్డి

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య లక్ష్యంతోనే కాక సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తేనే గుర్తింపు లభిస్తుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి చెప్పారు. హిమాయత్‌నగర్‌లోని డీమ్డ్ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో ఫలక్‌నాజ్ అనే విద్యార్థిని 'డయాబెటిక్ కాంప్లికేషన్స్' అంశంపై పరిశోధన చేయగా డాక్టరేట్ వరించింది. సోమవారం ఫలక్‌నాజ్‌కు పురుషోత్తంరెడ్డి డాక్టరేట్ అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, వీసీ శంకర్‌లింగం, ఫార్మసీ విభాగ హెడ్ కుమారస్వామి, ప్రొఫెసర్ క్రిస్టోఫర్, డీన్ రాజు, రాజేందర్‌రెడ్డి, జగదీశ్వర్, పీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.


దీక్షలో జేఏసీ నాయకులు

కొనసాగుతున్న మండల సాధన రిలే దీక్షలు

తలకొండపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాధన కోసం గట్టిప్పలపల్లి వాసులు ఉడుంపట్టు పట్టారు. నెలల పాటు రిలే దీక్షలు చేస్తున్నారు. మండల కేంద్రం ఏర్పాటయ్యే వరకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రజలంటున్నారు. 11 పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని చేస్తున్న రిలే నిరశన దీక్షలు సోమవారంతో 176వ రోజుకు చేరాయి. మండల కేంద్రం ఏర్పాటు విషయంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు అశోక్ గౌడ్, వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, శరత్‌చంద్ర, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.


కార్యవర్గాన్ని సత్కరిస్తున్న లారీ ఓనర్లు, డ్రైవర్లు

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపినాయక్

ఆమనగల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మేడిగడ్డ తండా మాజీ సర్పంచ్ గోపినాయక్ ఎన్నికయ్యారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలో లారీ ఓనర్లు, డ్రైవర్లు సమావేశమై సమస్యలపై చర్చించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపి నాయక్, ఉపాధ్యక్షుడు జహంగీర్, ప్రధాన కార్యదర్శి నరేశ్, కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారిగా సలీం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మల్లేశ్, రామస్వామి, అమర్, తిరపతయ్య, రాములు, నర్సింహ, బాలకిషన్‌సింగ్, షేర్‌ఖాన్ ఉన్నారు.

సంపదను లూటీ చేసిన బీఆర్ఎస్



మహేశ్వరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పదకొండేళ్లు బీజేపీ ప్రజస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంటే.. ఇక్కడ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని లూటీచేసిందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌కుమార్‌ల నేతృత్వంలో సామాజిక న్యాయమే ధ్యేయంగా చేపట్టిన జై సంవిధాన్ కార్యక్రమాన్ని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నిర్వహిస్తూ ప్రజలను చైతన్యమంతం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కులగణన చేసిన ముఖ్యమంత్రి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రాజ్యంగ నిర్మాత అంబేడ్కర్, స్వాతంత్ర్య పితామహుడు గాంధీజీని ప్రజలు మరిచిపోయేలా బీజేపీ కుట్రలకు పన్నుతోందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో దేశ ప్రజలను చైతన్యపరిచారన్నారు.


మే డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు


చేవెళ్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మే డేను జయప్రదం చేయాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే ఒకటిన జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ, సీఐటీయూ మండల కన్వీనర్ సీహెచ్.బుగ్గరాములు తెలిపారు. సోమవారం ఎలిమినేడులో మే డే పోస్టర్‌ను వారు విడుదల చేశారు. పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకుందామని అన్నారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మే 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు.

చేవెళ్ల: మే డే పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయచారి చేవెళ్ల పరిధిలోని అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి శివ, శేఖర్, ఇంద్రారెడ్డి, నర్సింలు, ఐలయ్య, లింగంగౌడ్, సురేశ్, రమేశ్, శ్రీకాంత్, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రైవేట్ సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలు

షాద్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ టెలికాం సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృతపరుస్తామని బీఎస్ఎన్ఎల్ డీజీఎం జి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం షాద్‌నగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. టెలికాం రంగంలో పోటీపెరిగిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ కూడా పోటీకి సిద్ధమైందన్నారు. ప్రస్తుతం ఆరునెలల కాలానికి ఫైబర్ నెట్ కనెక్షన్, రూటర్‌ను ఫ్రీగా అందజేస్తామన్నారు. వినియోగదాల సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం జయశ్రీ, ఎస్‌డీఈ రాధిక, కిషన్, సునిత, అబ్దుల్ ఖాదర్, అనసూయ, సుశీల, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్‌నెట్‌పై అవగాహన కల్పిస్తున్న డీజీఎం వెంకటేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మతి తప్పిన కేసీఆర్..

● అందుకే స్క్రిప్ట్ రాసుకొని ప్రసంగించారు
● ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): 'సాలు దొరా నీ పాలన.' అని 16 నెలల క్రితం ప్రజలు కేసీఆర్‌కు ఎన్నికల్లో బుద్ధిచెప్పినా ఆయనింకా మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. అందుకే ప్రసంగాన్ని రాసుకొచ్చి మాట్లాడారని అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అధికార దాహం, ఉనికిని కాపాడుకునేందుకే కేసీఆర్ బీఆర్ఎస్ వజ్రోత్సవసభను నిర్వహించారని అన్నారు. మిగులు బడ్జెట్‌తో సాకారమైన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసి అధోగతి పాలుచేశారన్నారు. సామాజిక తెలంగాణ సాధిస్తామని ప్రగల్భాలు పలికిన ఎందుకు మార్చలేదని ప్రశ్నించారు. తన పాలనలో ఏమీ సాధించని కేసీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరాన్ని కాలగర్భంలో కలిపారని, మేడిగడ్డ అని మేడిపండు చూపించారని ఎద్దేవా చేశారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్టును 30శాతం కూడా పూర్తి చేయలేదని, లక్ష్మీదేవిపల్లి అంటూ ఊరడించారన్నారు. కల్వకుంట్ల కుటుంబం ఆస్తులను వెంటనే బహిర్గతం చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇక కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమవుతారని జోస్యం చెప్పారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు, కృష్ణారెడ్డి, బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైతుల, భూముల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి, ఆర్వోఆర్ చట్టం తెచ్చిందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సోమవారం కవేలిగూడలోని ఓ గార్డెన్‌లో జరిగిన అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 6 వేల మంది రైతులున్నారని, త్వరలోనే గ్రామాల్లో అవగాహన సదుస్సులు నిర్వహిస్తారన్నారు. సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. ఆర్‌డీవో, తహసీల్దార్ స్థాయిల్లోనే సమస్యల పరిష్కరించేలా కొత్త చట్టం దోహదం చేస్తుందన్నారు. మండలంలో ఏళ్ల తరబడి ఉన్న భూ సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషిచేస్తానన్నారు. బహదూర్‌గూడ, కొత్వాల్‌గూడ, ఘన్సిమియాగూడ గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువ ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్, నాయకులు నీరటి రాజు, చిన్న గోల్కొండ ప్యాక్స్ చైర్మన్ దౌణకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్‌యాదవ్, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


కేఎస్ రత్నం, నర్సింహులుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చేవెళ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని వైభవం బంకిట్ హాల్‌లో సోమవారం సాయంత్రం బీజేపీ సంస్థాగత సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కమిటీలు పార్టీ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముష్కరమూకలు యాత్రికులపై అమానుషంగా దాడి చేయడం బాధాకరమన్నారు. దాయాది దేశం పాకిస్తాన్‌పై భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన సమర్థించారు. మున్సిపల్‌లో కమిటీల నిర్మాణం గురించి చర్చించి ప్రపోజల్‌ని అధిష్టానానికి పంపినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ పరిశీలకులు నర్సింలుగౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, భయానంద్. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాములుగౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వాసుదేవ్. మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి. నాయకులు పండిత్‌రావు తదితరులు ఉన్నారు.

పహల్గాం మృతులకు నివాళి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో భారత్ ఉలిక్కిపడిందని పలువురు నాయకులన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, విహారి కాలనీలో ఆదివారం రాత్రి పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అమాయక పర్యటకులను విచాక్షణ రహితంగా కాల్చిచంపడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొక్కు ప్రభాకర్, బాలేష్, మహేష్, ప్రవీణ్, ఆనంద్, బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ప్రదర్శనలో కాలనీవాసులు

నడిరోడ్డుపై దిగబడిన లారీ



తాండూరు పట్టణం అంబేడ్కర్ విగ్రహం ముందు రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో నాపరాయి లారీ దిగబడింది. ఈ ఘటన సోమవారం తాండూరు పట్టణం అంబేడ్కర్ చౌక్‌లో చోటుచేసుకుంది. మున్సిపల్ అధికారులు పైపులైన్ లీకేజీల మరమ్మతుల కోసం గుంతతవ్వి పూడ్చేశారు. నాపరాయి లోడ్‌తో కొడంగల్ వైపు వెళ్తున్న లారీ అధిక బరువు ఉండటంతో గుంతలో ఇరుక్కుపోయింది. లారీ బయటకు తీసేందుకు డ్రైవర్ ప్రయత్నించిన సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని లారీ బయటికి తీసేందుకు చర్యలు చేపట్టారు. - తాండూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)

ట్రాఫికర్

● రైల్వేస్టేషన్ కూడలిలో ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత

● ప్రయాణికులకు తప్పని తిప్పలు



బషీరాబాద్ రైల్వేస్టేషన్ కూడలిలో ప్రైవేటు వాహనాలు, రోడ్డుపై బస్సు

బషీరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కూడలిలో వాహనాలు అస్తవ్యస్తంగా నిలపడంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. నిత్యం ప్రైవేటు వహనాలు, లారీలు, ఆర్టీసీ బస్సులు భారీ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గం ఇరుకుగా ఉండటం, ప్రైవేటు, ఆర్టీసీ బస్సులకు ప్రధాన చౌరస్తా కావడంతో నిత్యం ఈ ప్రాంతం జనంతో కిటకిటలాడుతోంది. వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఇక్కడే నిలుపుతారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు వాహనాలు ఎక్కడబడితే అక్కడ నిలుపుతుండటంతో ఒక్కోసారి బస్సులను నడిరోడ్డుపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు పాదచారులు సైతం ముందుకు నడవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ మంగళవారం సంత రోజు కావడంతో వాహనాల రాకపోకల సంఖ్య అత్యధికంగా ఉంటుంది. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించి ఈ ప్రాంతంలో నిత్యం వాహనాలు నిలపకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పలువురు కోరుతున్నారు.

క్రైం కార్నర్

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘురాం

ధారూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సహజీవనం సాగిస్తున్న మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య నేరాన్ని ఒప్పుకున్నాడు. సోమవారం సీఐ రఘురాం హత్య కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. మండల పరిధిలోని రాజాపూర్ గ్రామానికి చెందిన మేతరి బాబాయ్య, దోమ మండలం రాకొండ గ్రామానికి చెందిన వెంటకమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకుని రెండు నెలలుగా గ్రామంలో సహజీవనం సాగిస్తున్నాడు. వారం రోజులుగా వెంకటమ్మ బాబయ్యతో గొడవపడుతూ నిన్ను విడిచిపెట్టి వెళ్లిపోతానని చెప్పింది. దీంతో ఈనెల 24న రాత్రి పూట బాబయ్య ఇంట్లోనే వెంకటమ్మ గొంతు నులిమి హత్య చేశాడు. ఆధారాలు దొరకకుండా మృతదేహనికి పాత బట్టలు, బొంతలు చుట్టి పాడుబడిన ఇంట్లో పడేసి మృతదేహంపై పెట్రోల్ వేసి నిప్పంటించి పారిపోయాడు. సోమవారం బాబాయ్యను పరిగి బస్టాండు సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నాడని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తలించామని సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య



సందీప్ కుమార్(ఫైల్)

తాండూరు రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన తాండూరు మండలం ఐనెల్లిలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సందీప్ కుమార్(31) అలియాస్ సన్ని అదే గ్రామానికి చెందిన తులసిని 14ఏళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఎబినేజర్, చంద్రశేఖర్ ఉన్నారు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే ఏడాది కిందట సందీప్‌కుమార్‌కు నాలుక క్యాన్సర్ రావడంతో ఆపరేషన్ చేయించారు. అప్పటి నుంచి కుటుంబంలో ఆర్థిక సమస్యలు మొదలయ్యాయి. ఈ విషయమై సందీప్‌కుమార్ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో ఈనెల 27వ తేదీన సందీప్ సాయంత్రం ఆటో కిరాయికి వెళుతున్నానని భార్యకు చెప్పి ఐనెల్లిలోని పాత ఇంటికి వెళ్లాడు. రాత్రి సమయంలో ఇంట్లోనే చీరతో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

● కండక్టర్‌కు స్వల్ప గాయాలు



ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

పరిగి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ డిపో ఎదుట నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్‌కు స్వల్పగాయాలు కాగా, బస్సు వెనుకభాగం దెబ్బతిన్నది. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న బస్సు సోమవారం ఉదయం పరిగి డిపో ఎదుట రోడ్డు నిలిచి ఉంది. వెనకాల నుంచి వేగంగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. కండక్టర్ రాములుకు స్వల్పగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరిగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేఘం.. ఆగమాగం!

(5వ పేజీ తరువాయి)

విస్తీర్ణం 20 శాతానికి పైగానే తగ్గింది. పరిగి, దోమ, కులకచ్ల, బొంరాసిపేట్, కొడంగల్, దౌల్తాబాద్, యాలాల్, తాండూరు తదితర మండలాల్లో వరిని ఎక్కువగా సాగు చేశారు. వారం నుంచి ఉరుములు, మెరుపులతో వస్తున్న గాలివానతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోతకొచ్చే సమయంలో వడగళ్ల వాన పడితే పంటలు పూర్తిగా దెబ్బతింటాయని గుబులు పడుతున్నారు. జిల్లాలో అక్కడక్కడ వరి పంటలు పచ్చగానే ఉన్నాయి. వరి కోసేవరకు వర్షాలు రాకూడదని రైతులు వరుణుడిని వేడుకుంటున్నారు.

రెండు రోజులుగా మేఘావృతం

ఘట్‌కేసర్ రూరల్: పంట కోతకొచ్చే సమయంలో వరుణుడు అన్నదాతలను భయపెట్టిస్తున్నాడు. రెండు, మూడు రోజులుగా ఉరుములు, మెరుపులతో దడ పుట్టిస్తున్నాడు. ఈ నెల 29 వరకు ఉరుములు, మెరుపులతో బలమైన ఈదురుగాలులు, గాలివాన, వడగళ్ల వాన వచ్చే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచించడంతో రైతులు మరింత ఆందోళనలకు గురవుతున్నారు. యాసంగిలో మండల పరిధిలో 3,350 ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇప్పటికే 20 శాతం కోతలు పూర్తికాగా కల్లాల్లో ధాన్యం ఆరబోశారు. ఎదులాబాద్, మాదారం గ్రామాల్లో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రతాప్‌సింగారంలో కోతలు ఆలస్యం కావడంతో అక్కడ కేంద్రాన్ని ప్రారంభించలేదు. రెండురోజులుగా నుంచి ఆకాశం మేఘావృతమై ఉండడంతో కోతకు సిద్ధంగా ఉన్న పంటలను త్వరగా కోసుకోవాలని, కల్లాల్లో ఉంచిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉరుములు, మెరుపుల సమయంలో రైతులు కరెంట్ స్తంభాలు, చెట్ల కింద ఉండకూడదని మండల వ్యవసాయ అధికారి ఎంఏ బాసిత్ సూచించారు.



ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు

అప్రమత్తంగా ఉండాలి



ఆకాశంలో ఉరుములు, మెరుపులు రైతులను భయపెట్టిస్తున్నాయి. రైతులు పంటలను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలి. చేతికొచ్చిన వరిని త్వరగా కోసుకోవాలి. ఆలస్యం చేస్తే ఇబ్బందులు ఎదురుకావొచ్చు. వీలైనంత త్వరగా పంటను ఇంటికి తీసుకొచ్చుకోవాలి.

- మోహన్‌రెడ్డి, డీఏవో, వికారాబాద్

వాతావరణం చూస్తే భయంగా ఉంది



ఐదు ఎకరాల్లో వరి సాగు చేసిన. కొద్ది రోజుల్లో పంట కోతకు వస్తుంది. రెండు రోజులుగా ఆకాశాన్ని చూస్తే భయం వేస్తుంది. ఉరుములు, మెరుపులు వస్తున్నాయి. 29 వరకు వాతావరణం ఇలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏమి చేయాలో తెలియడం లేదు.

- కొమ్మిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, రైతు ఎదులాబాద్

ట్రస్మా నియోజకవర్గ అధ్యక్షుడిగా చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

వికారాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. నూతన కార్యవర్గం ఏర్పాటు చేయగా అధ్యక్షుడిగా చంద్రశేఖర్ నియమితులయ్యారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా సుదీర్, ఉపాధ్యక్షులుగా మద్దూర్ పాషా, సంయుక్త కార్యదర్శిగా యాదయ్యలను నియమించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ నాగయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా కోశాధికారి ప్రకాశ్, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో మాజీ మంత్రి

వికారాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని మాజీ మంత్రి, భృంగీ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్ తెలిపారు. ఏసీఆర్ భృంగీ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన ర్యాంకులు సాధించిన సందర్భంగా సోమవారం వారిని అభినందించి సన్మానించారు. 11ఏళ్లుగా తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ఇది మా కళాశాల విద్యా ప్రమాణాలకు నిదర్శమన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపక బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్, కుమార స్వామి, వినోద్, రమాదేవి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం




సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. కొడంగల్‌లో బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల, కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి, కొడంగల్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 179 మంది లబ్ధిదారులకు సోమవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎన్.ప్రశాంత్, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

దోమ: ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన గుడ్ల నర్సింహులు కూతురు శిరీషకు సోమవారం ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.60వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశన్నగౌడ్, సాయిలు, వెంకటయ్య, అంజిలయ్య, రాములు, రవికుమార్‌గౌడ్, బుసాని కృష్ణ పాల్గొన్నారు.

రైతుల పొలాలకు బాట కల్పించండి



యాలాల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

యాలాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైతుల పొలానికి వెళ్లేందుకు బాట సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, నర్సింహులు యాలాల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని సర్వేనెంబర్ 232లో కొన్నేళ్లుగా పొలాలకు వెళ్లేందుకు బాట సౌకర్యం ఉందని తెలిపారు. అయితే కొందరు కావాలనే ఈ సర్వేనెంబర్‌లోని బాట నుంచి రైతులకు తమ పొలాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అధికారులు స్పందించి రైతులకు బాట సౌకర్యం కల్పించాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మహేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

'ట్రామాకేర్'పై ఆశలు

(5వ పేజీ తరువాయి)

ట్రామాకేర్ వ్యవస్థను బలోపేతం చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా 70 నుంచి 90 వరకు ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ట్రామాకేర్ సెంటర్లు లేక క్షతగాత్రులకు సమయానికి వైద్యం అందడం లేదని, ఈ నేపథ్యంలో అన్ని సౌకర్యాలతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

జాతీయ రహదారితో ప్రతిపాదనలకు మోక్షం

తాండూరు మీదుగా మహబూబ్‌నగర్ జాతీయ రహదారి (నేషనల్ హైవే) పనులు కొనసాగుతున్నాయి. కర్ణాటక రాష్ట్రం మన్నెకెల్లి నుంచి చించోలి, తాండూరు, కొడంగల్ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్ - 163 వెళ్తుంది.కొత్తగా ఏర్పాటు చేసే ట్రామాకేర్ సెంటర్లను నేషనల్ హైవేలకు దగ్గర్లో ఉన్న ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో దశాబ్ద కాలంగా ప్రతిపాదన దశలో ఉన్న తాండూరు ట్రామాకేర్ సెటర్‌కు మార్గం సుగమమైయింది. తాండూరు జిల్లా ఆస్పత్రి కేంద్రంగా ఈ సెంటర్ ప్రారంభమైయితే కర్ణాటక రాష్ట్రం చించోళి, కుంచారం, కొడంగల్ ప్రాంతంలో క్షతగాత్రులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుది. జాతీయ రహదారి పూర్తయితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో తాండూరు జిల్లా ఆస్పత్రిలో ఈ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన సదుపాయాలైన బెడ్లు, రూమ్‌లు, వైద్య సిబ్బంది అంబులెన్స్ వంటివి అందుబాటులో ఉన్నాయి. చించోళి నుంచి కొడంగల్ వరకు పెద్ద ఆస్పత్రి ఒక్క తాండూరులోనే ఉంది.

'గోల్డెన్ అవర్'లో చికిత్సే లక్ష్యం

ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటుకు ఆస్పత్రుల ఎంపిక, వాటికి అవసరమైన పరికరాలను సమకూర్చే బాధ్యతలను మంత్రి దామోదర రాజనర్సింహ తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు అప్పగించారు. ఈ కేంద్రాల్లో ఎముకల వైద్యులు, మత్తు మందు నిపుణులు, సిటీ, అల్ట్రా సౌండ్ స్కానర్లు, పోర్టబుల్ ఎక్స్‌రే తదితరాలతోపాటు ఆపరేషన్ థియేటర్ ఉంటాయి. క్షతగాత్రులకు వెంటనే చికిత్స అందించి గోల్డెన్ అవర్ లక్ష్యన్ని చేరుకోవడమే వీటి ప్రధాన లక్ష్యం. వీటిలో అందే చికిత్సతో బాధితులు కాస్త కోలుకున్నాక అవసరానికి అనుగుణంగా పెద్దాసుపత్రులకు తరలిస్తారు.

సార్వత్రిక సమ్మె కరపత్రాలు విడుదల



తాండూరు: కరపత్రాలను విడుదల చేస్తున్న శ్రీనివాస్

తాండూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సోమవారం తాండూరు పట్టణంలోని సీఐటీయూ నాయకులు కార్మికుల సమక్షంలో కరపత్రాలను విడుదల చేశారు. మే 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మేడేను జిల్లాలోని కార్మిక వర్గం జయప్రదం చేయాలని ఆయన కోరారు. 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. మేడేను దీక్ష దినంగా జరుపుకోవాలని కార్మికుల అడ్డల వద్ద జెండాలు ఎగుర వేసి ఐక్యత చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ సీసీఐ కాంట్రాక్టర్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శరణప్ప, కార్మికులు మాణిక్యం పాల్గొన్నారు.

తాండూరు రూరల్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సీసీఐ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని విడుదల చేశారు. సోమవారం తాండూరు మండల పరిధిలోని సీసీఐ కర్మాగారం మెయిన్ గేటు ఎదుట కార్మిక సంఘం నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, యూనియన్ కార్యదర్శి శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య మండల కమిటీ

దోమ: మండల మహిళా సమాఖ్య నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు డీపీఎం వీరయ్య తెలిపారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా దాదాపూర్ గ్రామానికి చెందిన ఈడిగి అనసూయ, ప్రధాన కార్యదర్శిగా శ్రీలత, కోశాధికారిగా విజయలక్ష్మిని ఎన్నుకున్నారు. మండల వ్యాప్తంగా 48 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. సమాఖ్య ఎన్నిక అధికారుల ప్రమేయంతో జరగాలి కానీ ఏపీయం సురేశ్ అధికార పార్టీకి తొత్తుగా మారి నాయకులు చెప్పిన విధంగా అధ్యక్ష పదవులు కట్టబెట్టడం ఏంటనీ విమర్శలు వెలువడుతున్నాయి. అధికారుల పనితీరుపై ఆయా గ్రామాల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మండల మహిళా సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కవిత, కార్యదర్శిగా మూడవత్ సునీత, కోశాధికారిగా కె.సునీతను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు చేయూతను అందించడం అభినందనీయం

పరిగి: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు చేయూతను అందించడం అభినందనీయమని పరిగి ఎంఈవో గోపాల్ అన్నారు. మండలంలోని మిట్టకోడూరు పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపు విద్యార్థులకు సోమవారం పీఆర్టీయూ మండల మాజీ అధ్యక్షుడు కావలి శ్రీశైలం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉస్మాన్‌అలీ, జగదీశ్వర్ పాల్గొన్నారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన

చౌడాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డీవో హాజరు కానున్నట్లు తెలిపారు.

దోమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన భూ భారతి చట్టంపై మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మధ్యాహ్నం 12:30 గంటలకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు దోమ తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు.

పరిగి: భూ భారతి చట్టంపై నేడు మంగవాళరం మధ్యాహ్నం రెండు గంటలకు పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు పరిగి తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు తెలిపారు. ఈ సదస్సుకు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి

వికారాబాద్: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు తమ వంతు కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిక్షపాటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గోదంగూడలో సోమవారం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి, రాజ్యాంగ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడ రాజశేఖరరెడ్డి ర్యాలీని ప్రారంభించారు.

కలిసికట్టుగానే ఉన్నాం



మట్లాడుతున్న సొసైటీ, ఏఎంసీ చైర్మన్లు, నాయకులు

బషీరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అందరం కలిసికట్టుగానే ఉన్నామని బషీరాబాద్(నవాంద్గీ) సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు శంకర్‌రెడ్డి అన్నారు. బషీరాబాద్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండల కాంగ్రెస్ నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయని, గత కొన్ని రోజులుగా వదంతులు వినిపిస్తున్నాయన్నారు. అందంతా కట్టుకథలని కొట్టిపడేశారు. తామంతా ఎమ్మెల్యే బుయ్యని మనోహరెడ్డి నాయకత్వంలో పని చేస్తామని ఎవరికి ఎలాంటి అనుమానాలు వద్దన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్



మట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి

బషీరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభ తెలంగాణ చరిత్రలో నిలిచిపోనుందని బషీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఇందర్ చెడ్ నర్సిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బషీరాబాద్‌లో సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి రజతోత్సవ సభ సక్సెస్ మీట్ నిర్వహించారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని ఇందుకు వరంగల్ సభ ఉదహరించవచ్చన్నారు. మండలం నుంచి వేలాదిగా తరలివచ్చి సభను సక్సెస్ చేసిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బషీరాబాద్ టౌన్ ప్రెసిడెంట్ సునీల్‌ప్రసాద్, రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత



చౌడాపూర్ మండలం మందిపాల్ గ్రామానికి చెందిన వెంకటయ్య మేనకోడలు అనూష వివాహం ఈనెల 30న నిశ్చయమైంది. పేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ మందిపాల్ గ్రామ యువ నాయకుడు మహేశ్ ద్వారా విషయం తెలుసుకున్న హైదరాబాద్‌లోని గాయత్రినగర్‌కు చెందిన సముద్రాల చంద్రశేఖర్, నాగమణి దంపతులు వారి ఇంటికి పిలిపించుకొని యువతికి పుస్తెమట్టెలు, చీర అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్, సాయి, ప్రదీప్, చెన్నయ్య పాల్గొన్నారు. - చౌడాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి)

7న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే 7న వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తాలో జరిగే భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నారు. ఈ మేరకు విగ్రహ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్పీకర్, శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి చేతులమీదుగా పోస్టర్ ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాబోతున్నారని నిర్వాహకులు తెలిపారు.


రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



మంబాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా వారు తీసుకువచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంబాపూర్, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో సోమవారం ఆయన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు తాగునీటితో పాటు తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, నరేందర్, మల్లేశం, శోభారాణి, సలాం, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పరిగి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెంబర్ 1లో 2006-07లో టెన్త్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సోమవారం పరిగిలో సమ్మేళనం జరుపుకున్నారు. 18 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.